నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 29 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 17, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

థాయిలాండ్ ప్రధానిగా
పేటోంగ్టార్న్ షినవత్రా

థాయిలాండ్: బిలియనీర్ మాజీ ప్రధాని థాక్సిన్ షినవత్రా కుమార్తె 37 ఏళ్ల పేటోంగ్టార్న్ షినవత్రా థాయిలాండ్ తదుపరి ప్రధానిగా ఆమోదం పొందారు. తన క్యాబినెట్ కు నేర చరిత్ర కలిగిన న్యాయవాదిని నియమించినందుకు రాజ్యాంగ న్యాయస్థానం మాజీ ప్రధాని స్రేత తావిసిన్ను పదవి నుండి తొలగించిన రెండు రోజుల తరువాత ఆమె ఎంపిక జరిగింది. పేటోంగ్టార్న్ దేశంలో ఈ పదవిని అలంకరించిన అతి పిన్న వయస్కురాలు అవుతారు. ఆమె షినవత్రా ముగ్గురు పిల్లలలో చిన్నది. అలాగే షినవత్రా కుటుంబంలో ప్రధాన మంత్రి అయిన నాల్గవ సభ్యురాలు. షినవత్రా బావమరిది సోమ్చాయ్ వాంగ్సావత్ 2008లో క్లుప్తంగా ఈ పదవిని నిర్వహించారు. ఆమె సోదరి యింగ్లక్ షినవత్రా 2011 నుండి 2014 వరకు ప్రధానమంత్రిగా పనిచేశారు.

ఆర్‌జీ కర్ ఆసుపత్రిపై దాడి కేసులో
హైకోర్టు సీరియస్

- ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు ఎలా పనిచేస్తారని ఆగ్రహం
- ఆసుపత్రి మూసేయడం మంచిదని వ్యాఖ్యలు

కోల్‌కతా,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
పశ్చిమ బెంగాల్‌లో ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిలపై జరిగిన హత్యాచార ఘటన పట్ల దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతుంటే ఇంకోవైపు అదే ఆసుపత్రిపై బుధవారం అర్ధరాత్రి దుండగులు దాడి చేయడం వివాదస్పదంగా మారింది. ఆర్‌జీ కర్ ఆసుపత్రిపై దాడి ఘటన పట్ల కోల్‌కతా హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందని, ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు ఎలా విధులు మిగతా.. 2లో



- అన్ని రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసనలు
- ఆందోళనల్లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు
- మమత రాజీనామా చేయాలంటూ బీజేపీ నిరసన
- ప్రభుత్వం, పోలీసుల తీరుపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వ యంత్రాంగం యొక్క సంపూర్ణ వైఫల్యమంటూ వ్యాఖ్యలు
- హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

దేశ వ్యాప్తంగా
వైద్యుల నిరసన

కోల్‌కతా,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
కోల్‌కతా హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. వైద్యురాలి హత్యాచారం తర్వాత నెమ్మదిగా ఆందోళనలు సాగుతున్న తరుణంలో ఒక్కసారిగా అల్లరిమూకలు.. ఆస్పత్రిలోకి ప్రవేశించి ఆధారాలు చెరిపేందుకు ప్రయత్నించడంతో తాజాగా ఈ ఆందోళనలు మరింత ఉధృతం అయ్యాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. తాజాగా కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రి దగ్గర బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. సీజీఓ కాంప్లెక్స్ వెలుపల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారుల్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు-బీజేపీ శ్రేణుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది.ఇదిలా ఉంటే కోల్‌కతా ఘటనకు నిరసనగా శనివారం ఉదయం 6 గంటల నుంచి దేశవ్యాప్తంగా మిగతా.. 2లో

నేడు దేశవ్యాప్తంగా
వైద్య సేవలు బంద్

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటన

న్యూఢిల్లీ,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
కోల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో 31 ఏళ్ల జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. కాగా, ఆసుపత్రిని సందర్శించిన గవర్నర్ బోస్ సంబంధిత జూనియర్ వైద్యులతో మాట్లాడారు. దేశంలోని అన్ని నగరాల్లో వైద్యులు నిరసనలు తెలుపుతున్నారు. విధుల నుంచి బహిష్కరించిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ట్రైనీ డాక్టర్ హత్యకు నిరసనగా రేపు దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. 17వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అత్యవసర వైద్య సేవలకు మినహాయింపు ఉంటుంది.

- ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో విస్తరించే సత్తా గల నగరం
- సీఎం రేవంత్ రెడ్డితో ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా
- హైదరాబాద్‌లో పెట్టుబడులకు సానుకూలత

ఫోర్త్ సిటీ ఏర్పాటులో
మీ విజన్ అద్భుతం..

న్యూఢిల్లీ,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక

సంస్థ ఫాక్స్ కాన్ చైర్మన్ యాంగ్ లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని ఆయన తెలిపారు. ఫాక్స్ కాన్ చైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది. హైదరాబాద్ నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను సీఎం రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును ముఖ్యమంత్రి తెలియజేశారు.

ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, మిగతా.. 2లో

బీజేపీలో
బీఆర్ఎస్ విలీనం
ఖాయం

- కేసీఆర్ గవర్నర్..
- కేటీఆర్‌కు కేంద్ర మంత్రి పదవి..
- కవితకు బెయిల్
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఆగస్ట్16,
బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయడం తథ్యమని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు

ఖండించినా.. అది ఎప్పటికీ జరుగి తీరుతుందని అన్నారు. విలీనం అయిన వెంటనే కేసీఆర్ కు గవర్నర్ పదవి, కేటీఆర్ కు కేంద్రమంత్రి పదవి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో హరీష్ రావు ప్రతిపక్ష నేత అవుతారని అన్నారు. విలీనం, పదవులు రాగానే.. కవితకు నాలుగు రాజ్యసభ సీట్లతో సమానంగా బెయిల్ వస్తుందని వెల్లడిం చారు. అదేవిధంగా బీఆర్ఎస్ మిగతా.. 2లో

ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన కోదండరాం, అమీర్ అలీఖాన్

- ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్16,
తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండ రామ్, అమీర్ అలీఖాన్‌లు శాసనమండలిలో అడుగుపెట్టారు. ఈ మేరకు ఇద్దరితో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణం చేయించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, అమీర్ అలీఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విప్ బీర్ల మిగతా.. 2లో

ఆడపడుచులను అగౌరవపరిచే
సంస్కృతి కాదు మాది

- మాజీ మంత్రి కేటీఆర్ వివరణ

హైదరాబాద్,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
కేటీఆర్ మహిళలపై చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపుతున్నాయి. చివరకు ఆయన దిష్టిబొమ్మలను తగులబెట్టే దాకా వెళ్లింది. మహిళా సంఘాలు కూడా తీవ్రంగా మండిపడుతున్నాయి. ఆర్టీసీ బస్సులలో తెలంగాణ మహిళలు కుట్లు, అల్లికలు, నిత్యావసరాలు అమ్ముకుంటే తప్పేమిటని కాంగ్రెస్ మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ మిగతా.. 2లో

బీజేపీలో బీఆర్ఎస్
విలీనం అబద్ధం

- తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ మమ అనిపించింది
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్,ఆగస్ట్16,
బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది శుద్ధ అబద్ధమని.. అలాంటి చర్చ బీజేపీలో లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఏమైనా మాట్లాడుకుంటునరేమో.. దాన్ని బట్టి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ఉండొచ్చని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం మిగతా.. 2లో



జమ్ము-కశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో
అసెంబ్లీ ఎన్నికలు

- సెప్టెంబర్18న తొలిదశ, 25న రెండో దశ ఎన్నికలు
- అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు.. అక్టోబర్4న ఫలితాలు
- మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

న్యూఢిల్లీ,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
జమ్ము-కశ్మీర్‌తో పాటు హర్యానా రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలి సారి కశ్మీర్‌లో ఎన్నికలు మిగతా.. 2లో

ఉగ్రవాదులతో పోరాడేందుకు
'స్పెషల్ 19' టీమ్

- జమ్మూ కాశ్మీర్‌లో పెరుగుతున్న ఉగ్రవాద కేసులు

న్యూఢిల్లీ,ఆగస్ట్16,
జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కేసులు పెరుగుతున్నాయి. గత 78 రోజుల్లో లోయలో 11 దాడులు జరిగాయి. ఆ తర్వాత భద్రతా దళాలు మోహరించి ప్రతి కదలికపై నిఘా ఉంచాయి. దీని కారణంగా ఉగ్రవాదులకు ముప్పుగా మారనున్న ఉగ్రవాదాన్ని మిగతా.. 2లో

హైదరాబాద్ నగరంలో
పలుచోట్ల భారీ వర్షం

- మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలో పలుచోట్ల భారీ వర్షం కురుస్తుంది. మరో రెండు గంటల పాటు భారీ వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బంజారా హిల్స్, మాధాపూర్, హైటెక్స్ సిటీ, పంజాగుట్ట, అమీర్ పేట్ పలు ప్రాంతాలలో వాన మిగతా.. 2లో

ఇస్రో ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం

శ్రీహరికోట,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో మరో ఘనత సాధించింది. శ్రీహరికోట షార్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇవాళ ఉదయం సరిగ్గా 9 గంటల 17 నిమిషాలకునిప్పులు చిమ్ముతూ అంతరిక్షంలోకి వెళ్లింది. 17 నిమిషాల పాటు సాగిన ఈ ప్రయోగం మిగతా.. 2లో

సీఎం రేవంత్‌తో అభిషేక్ మనుసింఘ్వీ భేటీ

న్యూఢిల్లీ,ఆగస్ట్16(నమస్తే ఉదయం):
ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి. ఇరువురు మధ్య దాదాపు పావుగంట సేపు మాట్లాడినట్టు తెలుస్తోంది. వివిధ అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా

అభిషేక్ మను సింఘ్విని కాంగ్రెస్ హైకమాండ్ ఖరారు చేసింది.ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ విడుదల మిగతా.. 2లో

ఆడపడుచులను అగౌరవపరిచే సంస్కృతి కాదు మాది

(మొదటి పేజీ తరువాయి)

అవన్నీ అమ్ముకుంటే ఫర్వాలేదు..వాళ్లు ఎలాంటి బ్రేక్ డ్యాన్సులు చేసినా ఫర్వాలేదు..కానీ బస్సుల్లో టిక్కెట్ కొనుక్కుని సీట్లు దొరకక అల్లాడుతున్న జనాలను పట్టించుకోవడం లేదని అన్నారు. తాను కేవలం బస్సుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ వ్యాఖ్యలు చేశానని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ మహిళా కమిషన్ కేటీఆర్ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుంది.తక్షణమే విచారణ జరిపించాలని మహిళా కమిషన్ ను ఆదేశించింది. దీనిపై మంత్రి సీతక్క సైతం కేటీఆర్ పై ఘాటుగానే స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని ..అది చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోలున్నారని కేటీఆర్ పై రివర్స్ కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తాను ఉద్దేశ పూర్వకంగా మహిళలపై అలాంటి కామెంట్స్ చేయలేదని.. తనకు, తమ పార్టీకి మహిళలంటే ఎంతో గౌరవముందని అన్నారు. అనవసరంగా దీనిని ప్రతిపక్షాలు రాద్దాంతం చేస్తున్నాయని అన్నారు.కించపరిచే ఉద్దేశం లేదుఒక వేళ తాను చేసిన వ్యాఖ్యలకు ఎవరికైనా మనస్తాపం కలిగివుంటే క్షమించమని కోరుకుంటున్నానని అన్నారు. తనకు అక్కచెల్లెళ్లను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదని అన్నారు. కావాలనే కాంగ్రెస్ మంత్రులు దీనిని పెద్దగా చేసి రాజకీయం నడుపుతున్నారని అన్నారు. ఇలాంటి చీఫ్ ట్రిక్స్ వలన నష్టపోయేది కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చామని అన్నారు. పెద్ద మనసుతో తెలంగాణ మహిళలు అర్థం చేసుకుంటారని.. ఆ నమ్మకం తనకు ఉందని కేటీఆర్ అంటున్నారు.

బీజేపీలో బీఆర్ఎస్
విలీనం అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రుణమాఫీ మమ అనిపించిందని మండిపడ్డారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ ఈ ప్రభుత్వం చేయలేదు.. ప్రజల్ని రైతుల్ని సీఎం మోసం చేశారని అన్నారు. హైడ్రా పేరుతో అడ్డగోలుగా కూల్చివేతలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అడ్డగోలుగా కూలగొట్టి అధికారం వారికి ఎవరు ఇచ్చారన్నారు. పరిధిలో ఉన్న భూములు ప్రభుత్వ భూములు కాదు.. అవి రైతులవి అన్నారు. అప్పట్లో ఎందుకు నిర్మాణాలకు అనుమతి ఇచ్చారన్నారు. ఇక పై నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. ORR లోపల ప్రాంతాల విలీనం అనేది ఏదో గీతలు గీసినట్టు ఉండకూడదు. అన్ని అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ గ్రాఫ్ ఏమీ పడిపోలేదు ఒక్కో సారి ఒక్కోలా ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్ష మార్పుపై నాకు ఎలాంటి సమాచారం లేదు. పార్టీ చూసుకుంటుందని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో గతంలో కేటీఆర్ మాట్లాడినట్టే రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని తెలిపారు. వేల కోట్ల పెట్టుబడులు అనేది తప్పన్నారు. లోకల్ వారిని ప్రోత్సహించాలన్నారు.

జమ్ము-కశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో
అసెంబ్లీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. పలు దశల్లో సమీక్షల అనంతరం కశ్మీర్‌లో ఎన్నికలకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలు కూడా తీసుకున్నామని.. ఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్18న తొలిదశ, 25న రెండో దశ, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు అక్టోబర్4న వెలువడతాయి. మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

అటు హర్యానాలోని 90 నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 1న సింగిల్‌ఫేజ్‌లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు 4న వెలువడతాయి. అక్టోబర్6 వరకూ రాష్ట్రంలో కొడ్ కొనసాగు తుంది. కాగా జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఇదే తొలి అసెంబ్లీ ఎన్నికలు. ఆగస్టు 9న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తన బృందంతో జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. వీలైనంత త్వరగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు కమిషన్ కట్టుబడి ఉందని చెప్పారు. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీలైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, అక్కడ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం ప్రకారం.. ఉత్తర కాశ్మీర్‌లోని జిల్లాల్లో చాలా సవాళ్లు ఉన్నాయి.

ఇక్కడ చాలా ప్రాంతాలు సున్నితమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఉత్తర కాశ్మీర్‌లో అనంత్‌నాగ్, బారాముల్లా, బుద్గాం, బందిపూర్, గందర్‌బల్, కుప్వారా, కుల్గాం, పుల్వామా, షోపియాన్, శ్రీనగర్ జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడగా, దక్షిణ కాశ్మీర్‌లో కథువా, సాంబా, రియాసి, జమ్ము, ఉధంపూర్ వంటి జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడ్డాయి.జమ్మూ కాశ్మీర్‌లో ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించవచ్చని వర్గాల సమాచారం. జమ్మూకశ్మీర్‌లో చివరిసారిగా 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది కూడా ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ, పీడీపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మెహబూబా ముఫ్తీ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2018లో సార్వత్రిక ఎన్నికలకు ముందు భాజపా కూటమిని విచ్ఛిన్నం చేయడంతో మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం పడిపోయింది. ఆ తర్వాత 2019లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి కానీ అసెంబ్లీకి ఎన్నికలు జరగలేదు.జమ్మూ కాశ్మీర్‌లో డీలిమిటేషన్ తర్వాత, అసెంబ్లీలో మొత్తం సీట్లు 114 సీట్లకు పెరిగాయి. వాటిలో 24 సీట్లు పీవోకే పరిధిలోకి వస్తాయి. మిగిలిన 90 సీట్లలో 43 సీట్లు జమ్మూ డివిజన్‌లో, 47 సీట్లు కాశ్మీర్ డివిజన్‌లో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 87 స్థానాలకు పోలింగ్ జరిగింది. పీడీపీకి అత్యధికంగా 28 సీట్లు వచ్చాయి. దీంతో పాటు బీజేపీకి 25, నేషనల్ కాన్ఫరెన్స్‌కు 15, కాంగ్రెస్‌కు 12 సీట్లు వచ్చాయి. మూడు స్థానాలు ఇండిపెండెంట్లకు, 4 ఇతరులకు దక్కాయి. హర్యానాలోని 90 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు నిర్వహించవచ్చు. ప్రస్తుతం ఇక్కడ బీజేపీ ప్రభుత్వం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 40 సీట్లు గెలుచుకుంది. మనోహర్ లాల్ ఖట్టర్ సీఎం అయ్యారు. ఎంపీ అయిన తర్వాత నాయబ్ సింగ్ సైనీ ఇక్కడ సీఎంగా ఉన్నారు. మరోవైపు మహారాష్ట్రలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ఇక్కడి 288 స్థానాలకు ఎప్పుడు ఓటింగ్ జరగనుందో తర్వాత తెలుస్తుంది. ఇక్కడ బీజేపీ-శివసేన (షిండే వర్గం) ప్రభుత్వం ఉంది. జార్ఖండ్‌లో 81 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ జేఎంఎం-కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది.

ఉగ్రవాదులతో పోరాడేందుకు
'స్పెషల్ 19' టీమ్

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రించేందుకు 'స్పెషల్ 19' బృందాన్ని రంగంలోకి దించారు. జమ్మూలోని 8 తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో కౌంటర్ టెర్రర్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిప్యూటీ ఎస్పీ) నేతృత్వంలోని ఈ ప్రత్యేక బృందాలు ఎనిమిది జిల్లాల్లో వ్యూహాత్మకంగా మోహరించబడ్డాయి. ఉధంపూర్, కతువా, రియాసి, దోడా, కిష్ట్వార్, రాంబన్, రాజౌరి, టెయిల్స్‌తో సహా ఈ బృందాలను మోహరించారు. ప్రస్తుతం అత్యధిక సంఖ్యలో తీవ్రవాద సంఘటనలు నమోదైన పిర్ పంజాల్, చీనాబ్ పర్వత శ్రేణులు వంటి అత్యంత సున్నితమైన ప్రదేశాలు ఉన్నాయి. ఈ కొత్త యూనిట్ల పరిధిలోకి వచ్చే నిర్దిష్ట ప్రాంతాలు: ఉధంపూర్ జిల్లా: లాటి, పంచారి, కథువా జిల్లా: మల్హార్, బని, రియాసీ జిల్లా: పౌని/రాన్సూ, మహూర్/చస్నా, గులాబ్‌ఘర్, పసానా, దోడా జిల్లా: దేసా/కస్తిగర్, అసర్ కిష్ట్వార్ జిల్లా: దచాన్, ద్రబ్షల్లా, రాంబన్ జిల్లా: రామ్సు, చంద్రకోట్/బటోటే, సంగల్దాన్/ధరంకుండ్, రాజౌరి జిల్లా: కలకోట్, పూంచ్ జిల్లా: బఫ్లియాజ్/బెహ్రాంగల్లా, మండి/లోరాన్ గుర్సాయి.ఈ బృందాలు ఇతర భద్రతా దళాలతో సమన్వయంతో పని చేస్తాయి. ప్రధానంగా ఉగ్రవాదాన్ని నిరోధించడానికి పనిచేస్తాయి. వారు తమ అధికార పరిధిలో సాధారణ నేరాలను కూడా డీల్ చేస్తారు. తాజా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి, ఆ ప్రాంత భద్రతను పరిష్కరించేందుకు ఈ బృందాలు ఏర్పాటు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో పెరుగుతున్న దుర్మార్గపు దాడుల కారణంగా.. ఆగస్టు 14 న, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో సమావేశాన్ని పిలిచి, ఈ దాడులను ఆపడానికి మార్గాలను చర్చించారు. ఇంతలో దోడాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగింది. ఇందులో ఒక సైనికుడు వీరమరణం పొందాడు. అయితే, దేశాన్ని రక్షించేందుకు సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేస్తుంటే, వారు నిరంతరం ఉగ్రవాదుల దుష్ట ప్రయత్నాలను తిప్పికొడుతూ, పూర్తి ధైర్యంతో పోరాడుతున్నారు.

సీఎం రేవంత్‌తో అభిషేక్ మనుసింఘ్వీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. తెలంగాణ నుంచి ఒక సీటు ఉంది. గతంలో బీఆర్ఎస్‌లో వున్న కె కేశవరావు ఆ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌కి వచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజ్యసభ సీటుకు ఉపఎన్నిక అనివార్యమైంది. కేకే ప్లేస్‌లో అభిషేక్ మను సింఘ్వీకి పెద్దల సభకు పంపించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. ఆయనకు టికెట్ ఓకే చేసింది కూడా. సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు అభిషేక్ మను సింఘ్వీ. 2001 నుంచి పార్టీ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. రెండుసార్లు పెద్దల సభకు ఎన్నికయ్యారు. అయితే ఈ ఏడాది మొదట్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఆయన అనుభవాన్ని గుర్తించిన కాంగ్రెస్ పెద్దలు, మనుసింఘ్వీని రాజ్యసభకు పంపాలని నిర్ణయించు కుంది. ఈనెల 21న రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగనుంది. 27న నామినేషన్ ఉప సంహరణ ప్రక్రియకు గడువు ఉంది. సెప్టెంబర్ మూడున పోలింగ్ జరగనుంది.. అదే రోజు ఫలితాలు వెల్లడికానున్నాయి.

ఇస్రో ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

సక్సెస్ కావడంతో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కాగా.. 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. పర్యావరణం, ప్రకృతి విపత్తులను పర్యవేక్షణ టార్గెట్ గా సైంటిస్టులు ఈ మిషన్ ను ప్రవేశపెట్టారు.ఈ ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ బరువు 119 టన్నులు, ఎత్తు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్లుగా ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 475 కిలోమీటర్ల ఎత్తున శాటిలైట్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా డిజైన్ చేశారు. ఈవోఎస్-08 శాటిలైట్ బరువు 175.5 కిలోలు. ఇక ఈ శాటిలైట్‌లో మూడు పే లోడ్స్‌ని ఇస్రో శాస్త్రవేత్తలు అమర్చారు. అవి ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ , పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రారెడ్‌లు.. ఇవి భూమికి సంబంధించిన చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. అలాగే ఇవి తీసిన పిక్స్‌ని పరిశీలించి వాతావరణం పరిస్థితులు, విపత్తులపై అధ్యయనం నిర్వహిస్తారు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు సేవలను అందజేయనుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో తెలిపింది. అంతేకాదు, ఇది SSLV ప్రాజెక్ట్‌కు అవకాశాలను తీసుకొస్తుందని, సరికొత్త మిషన్లకు శ్రీకారం చుడుతుందని ఇస్రో చెబుతోంది. పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఎక్కు సమయం, ఖర్చు కూడా అధికమే. కానీ, ఎస్ఎస్ఎల్వీ చాలా ప్రత్యేకమైనది. తక్కువ ఖర్చు, సమయం, పరిమిత మానవవనరుల సాయంతో కేవలం 72 గంటల వ్యవధిలో ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. ఇది ఇస్రో వాణిజ్య ప్రయోగాలను మరింత రెట్టింపు చేయగలదని భావిస్తున్నారు. దీనివల్ల ప్రపంచ అంతరిక్ష వాణిజ్యంలో ఇండియా వాటా పెరుగుదలకు తోడ్పడుతుంది. కాగా, 2022లో తొలిసారిగా నిర్వహించిన ఎస్ఎస్ఎల్వీ ప్రయోగం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యల తెలుసుకొని 2023లో మరో ప్రయోగం నిర్వహించి సక్సెస్ అయింది.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనమయ్యే అవకాశం ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ బిజీ షెడ్యూల్ లో ఉన్నారు.

ఈరోజు ఢిల్లీలో ఫాక్స్‌కాన్-యాపిల్ మ్యానుఫ్యాక్చరర్స్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన పెట్టుబడులే లక్ష్యంగా సాగిన సంగతి తెలిసిందే.

సీఎం రేవంత్ రెడ్డి సొంత దేశంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఫాక్స్‌కాన్-యాపిల్ మాన్యుఫ్యాక్చరర్స్ కంపెనీ ప్రతినిధులతో భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగంలోని పెద్దలను కూడా కలిసే అవకాశం ఉందని తెలిపారు. ఇక కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ లు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ చర్చించనున్నారు.

వరంగల్‌లో జరిగే రైతు కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని సీఎం ఆహ్వానించనున్నారు. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సోనియాను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెండు మూడు రోజుల పాటు సీఎం రేవంత్ ఢిల్లీలోనే ఉండనున్నారు.

ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన కోదండరాం, అమీర్ అలీఖాన్

(మొదటి పేజీ తరువాయి)

అయిలయ్య, ఎమ్మెల్సీ సి.మహేష్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం

నరేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన తర్వా త కోదండరామ్ మాట్లాడారు. తాను ఎమ్మెల్సీగా నియామకం కావడంతో ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ పదవిని అదనపు బాధ్యతగా మాత్రమే భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నేను ఎప్పుడూ ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షల మేరకు పనిచేస్తానని ప్రకటించారు. ఈ పదవి చాలామంది బలిదానాలు చేయడంతో వచ్చిందని, వాళ్లను ఎప్పటికీ మరవమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వీరిద్దరిని గతంలోనే నామినేట్ చేయగా.. ఈ విషయంపై బీఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లింది. నియామక గెజిట్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అయితే ఈ విషయంపై ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీగా నియామించాలంటూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సిఫార్సులను అప్పటి గవర్నర్ రద్దు చేసిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్ నగరంలో
పలుచోట్ల భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

కురుస్తుంది. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా వర్షం కాస్త ఊరటనిచ్చింది. భారీ వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.ఆగస్టు 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, సంగారెడ్డి, మెదక్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సూర్యాపేట, మహబూబ్, వరంగల్, సూర్యపేట, హనుమకొండ, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాత్రి 9 గంటల వరకు సికింద్రాబాద్‌లోని పాటిగడ్డలో అత్యధికంగా 74.8 మి.మీ, బన్సీలాల్‌పేటలో 73.0 మి.మీ వర్షం కురిసింది. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) అధికారులు వెల్లడించారు. ముషీరాబాద్‌లో 73, రామచంద్రాపురంలో 68.5, కూకట్‌పల్లిలో 64.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాల విషయానికి వస్తే సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 93.5 మిల్లీమీటర్లు, నాగర్ కర్నూల్ జిల్లాలో 87 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే, దయచేసి 040-21111111 లేదా 9000113667కు కాల్ చేయండి.

ఫోర్త్ సిటీ ఏర్పాటులో మీ విజన్ అద్భుతం..

(మొదటి పేజీ తరువాయి)

క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు.

నవతరం పరిశ్రమల అవసరాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో ఆయా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్రను చైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ చైర్మన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను సీఎం రేవంత్ రెడ్డి వారికి వివరించారు.

ఫోర్త్ సిటీలో ఫాక్స్ కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు అవసరమైన మద్దతు అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ చైర్మన్ యాంగ్ లియూ కి హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పారిశ్రామిక అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్ యాంగ్ లియూకి వివరించారు.

సీఎం విజన్ ఆకట్టుకుంది

ఫోర్త్ సిటీ రూపకల్పనలో సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఫాక్స్ కాన్ చైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ యాంగ్ లియూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు. తాను సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ , సంస్థ భారత దేశ ప్రతినిధి వీలీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని ఆయన చెప్పారు.

భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్సటర్నల్ ఎంగేజ్‌మెంట్), ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ, ఫాక్స్ కాన్ నుంచి సంస్థ ఎస్బీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్, సీబీజీ జీఎం జొ వూ, చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సీఎస్‌బీజీ డిప్యూటీ జీఎం సూ, షో కూ , సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్, సంస్థ భారత దేశ ప్రతినిధి వీలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీ కర్ ఆసుపత్రిపై
దాడి కేసులో హైకోర్టు సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వర్తించగలగరని ప్రశ్నించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది.

లేదంటే ఆసుపత్రి మూసేయడమే మంచిదని అసహనం వ్యక్తం చేసింది. హత్యాచారానికి వ్యతిరేకంగా ఒకవైపు నగరమంతా నిరసనలు తెలుపుతోంటే.. మరోవైపు ముసుగులు ధరించిన విధ్వంసకారులు కర్రలు, ఇటుకలు, రాడ్లతో ఆసుపత్రి ఆవరణలోకి దూసుకొచ్చి దాడులు చేశారు. అత్యవసర గది, నర్సింగ్ స్టేషన్, మందుల దుకాణం, ఔట్ పేషంట్ విభాగాలతో (ఓపీడీ) పాటు సీసీ టీవీలను ధ్వంసం చేశారు. అర్ధరాత్రి సుమారు 40 మంది వరకూ నిరసనకారుల రూపంలో వచ్చిన దుండగులు ఆసుపత్రిలో విధ్వంసం సృష్టించారని, వీరి దాడిలో తమ వాహనం సహా మరికొన్ని ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. మరికొంతమంది పోలీసులకు గాయాలైనట్లు తెలిపారు.

గుంపును చెదరగొట్టడానికి తాము బాష్పవాయు గోళాలను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఆసుపత్రిపై దాడులతో రాష్ట్రంలో మరోసారి ఆందోళనలు మిన్నంటాయి. మరోవైపు ఆర్‌జీకర్ ఆసుపత్రి హత్యాచార ఘటనలో నిందితుడికి మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారు. ఆదివారంలోగా కేంద్ర సంస్థ సీబీఐ దర్యాప్తు పూర్తి చేయాలని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే కోల్‌కతా పోలీసులు 30 శాతం దర్యాప్తును పూర్తి చేశారని వెల్లడించారు.

దేశ వ్యాప్తంగా వైద్యుల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్

అక్రమ అబార్షన్.. శ్రీ శ్రీనివాస

ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు

కొత్తూరు,ఆగస్టు 16(నమస్తే ఉదయం): గిరిజన బాలిక అబార్షన్ కేసును వైద్యశాఖ సీరియస్‌గా తీసుకుంది.అబార్షన్ చేసిన క్లినిన్‌ను సీజ్ చేసింది.వివరాల్లోకి వెళ్తే..రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస క్లినిక్‌ను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు.13 ఏళ్ల గిరిజన మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటనలో అబార్షన్ చేసిన క్లినిక్ వైద్యుడు డాక్టర్ రంజిత్ వ్యవహారంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్లినిక్‌ను సీజ్ చేశారు. సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే విధంగా మైనర్ అబార్షన్ సంఘటనపై రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం విధితమే..అయితే గత మూడు రోజులుగా మీడియాలో ఈ ఘటనపై తీవ్ర దుమారం రేగుతుంది.వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆలస్యంగా స్పందించినప్పటికి చర్యల నిమిత్తం సీజ్ చేసినట్టు తెలిపారు.కాగా,ఆయుర్వేదిక్ డాక్టర్‌గా అనుమతి తీసుకున్న రంజిత్ అల్లోపతి వైద్యం చేస్తున్నారు.

సీజ్ చేసిన హాస్పిటల్ క్లినిక్

అలాగే శ్రీలక్ష్మీ మెడికల్ హాల్ పేరిట లోపల శ్రీ శ్రీనివాస క్లినిక్ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం..మరి ఇన్ని రోజులు అధికారులు అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాజేంద్రనగర్‌లో మైనర్ బాలిక ఆత్మహత్య

రాజేంద్రనగర్, ఆగస్టు 16 (నమస్తే ఉదయం): కడుపునొప్పి భరించలేక ఇంటర్ చదువుతున్న బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ లో నివాసం ఉంటున్న మైనర్ బాలిక తండ్రి చనిపోవడంతో తల్లి, అక్కతో కలిసి నివసిస్తోంది. ఈమధ్య బాలికకు తరచూ కడుపునొప్పి తీవ్రంగా వస్తుండటంతో మనస్థాపానికి గురైంది.

శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి పై కప్పుకు ఉన్న రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిలుకూరులో భక్తి శ్రద్ధలతో

ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు

మొయినాబాద్ ఆగస్టు 16 (నమస్తే ఉదయం):

మండల పరిధిలోని చిలుకూరులో ధనలక్ష్మి, ధాన్య లక్ష్మి, మా ఇంట రావమ్మ మహాలక్ష్మి అంటూ గౌరమ్మను మహిళలు తమ ఇళ్లల్లో ఏర్పాటు చేసి మహా మంగళహారతితో కోలిచారు. శ్రావణ రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రత పూజలు కావడంతో గ్రామాల్లోని మహిళలు వారి వారి ఇళ్లల్లో లక్ష్మిదేవి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు ఏర్పాటు చేసిన లక్ష్మిదేవి వ్రత పూజల్లో పూలు, పండ్లు నైవేద్యంతో పాటు తొమ్మిది రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి వేదపండితులచే ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు మంత్రోచరణాలతో ఆదిలక్ష్మి రావమ్మ ధాన్య లక్ష్మి నీవమ్మ ధైర్య లక్ష్మి, గజ లక్ష్మి, విజయలక్ష్మి, సంతాన లక్ష్మి, విద్యలక్ష్మి, ధనలక్ష్మి, అష్టలక్ష్మి మంత్రాలతో లక్ష్మిదేవిని కొలుస్తూ మంత్రోచరణాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో వరలక్ష్మి వ్రత పూజలు వైభవంగా జరుపుకున్నారు వ్రతంలో పాల్గొన్న మహిళలకు ఆన వాయితీగా వసువుబొట్టు తమలపాకులు పండ్లు వక్కలు సమర్పించారు.

సరస్వతి శిశు మందిర్‌లో

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం...

శంషాబాద్, ఆగస్టు 16(నమస్తే ఉదయం): భారతీయులు పవిత్ర మాసంగా భావించే శ్రావణ మాసము రెండో శుక్రవారం శంషాబాద్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశు మందిర్ శంషాబాద్ పాఠశాలలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతం లొ భక్తులు పెద్ద సంఖ్యలో

పాల్గొన్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారుగా 100 మంది వరకు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షులు చింతల హనుమంతరావు. ఉపాధ్యక్షులు పంతులు చెన్నయ్య పూర్వ విద్యార్థి సలహా సమితి సభ్యులకు శ్యాంసుందర్ గ్రామ పెద్దలు ప్రధానాచార్యులు సౌభాగ్యవతి ఆచార్యులు పోషకులు పాల్గొనడం జరిగింది.

లక్ష్మి గూడా హౌసింగ్ బోర్డ్ కాలనీ

సమస్యలు పరిష్కరించండి

రాజేంద్ర నగర్, ఆగస్టు16(నమస్తే ఉదయం): లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ను కలిసి కాలనీ సమస్యలు వివరించడం జరిగింది . సమస్యలని విన్న ఎమ్మెల్యే స్పందించి వెంటనే కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ను కలసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు అడికె రాజు, నర్సింగ్, ప్రధాన కార్యదర్శి రఘుపతి, రాధాకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఆడికె రాజు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

రెండవ జత ఏకరూప దుస్తులు విద్యార్థులకు రేపు సాయంత్రంలోగా ఇచ్చేయాలి

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించాలి - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, ఆగస్టు16(నమస్తే ఉదయం): ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదు శాతంతో పాటు పదవ తరగతి విద్యార్థుల పాస్ శాతం గణనీయంగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

శుక్రవారం మధ్యాహ్నం ఐ.డి.ఓ.సి. సమావేశ హాల్లో మండల విద్యా అధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం ఐ.డి.ఓ.సి. సమావేశ హాల్లో మండల విద్యా అధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని రేపటి నుండి ఉదయం 9.00 గంటల వరకు పాఠశాలల్లో హాజరు కావాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు తన సెల్ ఫోన్లో జి.పి ఎస్.

కెమెరా యాప్ డౌన్లోడ్ చేసుకొని పాఠశాల చేరుకున్న వెంటనే సెల్ఫీ ఫోటో తీసుకొని సంబంధిత క్లస్టర్ హెడ్మాస్టర్ కు పంపించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా మండల విద్యా అధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్ల హాజరును జిల్లా విద్యా అధికారి పర్యవేక్షించాలని ఆదేశించారు.

కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని రేపటి నుండి ఉదయం 9.00 గంటల వరకు పాఠశాలల్లో హాజరు కావాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు తన సెల్ ఫోన్లో జి.పి ఎస్. కెమెరా యాప్ డౌన్లోడ్ చేసుకొని పాఠశాల చేరుకున్న వెంటనే సెల్ఫీ ఫోటో తీసుకొని సంబంధిత క్లస్టర్ హెడ్మాస్టర్ కు పంపించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా మండల విద్యా అధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్ల హాజరును జిల్లా విద్యా అధికారి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆలస్యం అయ్యే విధుల పట్ల నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.కొన్ని పాఠశాలల్లో ఇంకా రెండవ జత ఏక రూప దుస్తులు ఇవ్వలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇప్పటికే పాఠశాలకు వచ్చిన దుస్తులను రేపు సాయంత్రం లోగా విద్యార్థులకు ఇచ్చేయాలని ఆదేశించారు. రాని పాఠశాలలు వచ్చినవి వచ్చినట్లు ఇచ్చేయాలి తప్ప వద్ద పెట్టుకోవద్దని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ అది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఖచ్చితంగా ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని సూచించారు.

దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించడం జరిగింది. కాబట్టి ఇక విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా వచ్చిన విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చూసుకోవాలి. ఈసారి పదవ తరగతి పాస్ శాతం గణనీయంగా పెరగాలని అందుకు కృషి చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం పదవ తరగతిలో అత్యల్ప పాస్ శాతం,క్రమంగా విద్యార్థుల నమోదు తగ్గుదల అవుతున్న పాఠశాలల గురించి హెడ్మాస్టర్ లను వివరణ

ఇచ్చిన సూచనలు రేపటి నుండి అమలు జరగాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా విద్యా అధికారి గోవింద రాజులు, యం.ఈ.ఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి : కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

కొత్తకోట, ఆగస్టు16(నమస్తే ఉదయం): తెలంగాణ మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన కేటీఆర్ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు కొత్తకోట పట్టణంలో శుక్రవారం పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు . ఈ నిరసన కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొని మాట్లాడుతూ...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పట్ల అనుచితంగా మాట్లాడి కించపరుస్తూ బస్సులలో బ్రేక్ డాన్సులు,లి లిరికార్డింగ్ డ్యాన్సులు చెయ్యండి అంటూ అత్యంత అవహేళనంగా మాట్లాడడం పట్ల త్రీవంగా ఖండిస్తూ

కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణలో ఉండే మహిళలకు తెలంగాణలో ఉండే మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల ఇదేనా నీ సంస్కారం, మీ తల్లిదండ్రులు మీకు మహిళల పట్ల నేర్పిన గౌరం ఇదేనా కేటీఆర్ ఇలాగే మరోసారి మహిళలను కించపరిచేలా మాట్లాడితే అక్కచెల్లెళ్లతో కేటీఆర్ కు చీపురు దెబ్బలు తప్పవని హెచ్చరిస్తున్నాం.ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ కార్యదర్శి పి రవీందర్ రెడ్డి, సలీం ఖాన్, జెసిబి రాములు,రాష్ట్ర ఫిషరీస్ కార్యదర్శి సంద వెంకటేష్, జె కె. రాజు, కదిరే సాయిలు, ఎండి గఫార్, ముంత సాయిలు యాదవ్, వనపర్తి కృష్ణారెడ్డి, రాములు యాదవ్, వలుగోమని శ్యాం, మద్యం మోని అంజన్న యాదవ్,బాలరాజ్, ఎండి ఇజ్జాజ్జి, శ్రీకాంత్, మహేశ్వర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, అబ్బు, బాలరాజు, ఖలీల్,మహేష్, రాములు, నగరాములు కొత్తకోట సోషల్ మీడియా కార్తీక్ గౌడ్, దేవరకద్ర జిఎంఆర్ సోషల్ మీడియా నవీన్ కుమార్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ

దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

కేటీఆర్‌పై మండి పడిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్.

శంషాబాద్, ఆగస్టు 16(నమస్తే ఉదయం): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల పట్ల కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దగ్ధం చేశారు.

శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమానికి తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై దిష్టిబొమ్మ దగ్ధం అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పది సంవత్సరాలు మంత్రిగా ఉన్న కేటీఆర్ అసహనంతో విమర్శలు చేస్తున్నారని ఒక ముఖ్యమంత్రికి కొడుకుగా రాష్ట్ర మంత్రిగా ఉండి మహిళల పట్ల విడ్డూరంగా మాట్లాడడం తగదని హెచ్చరించారు.అధికారం కోల్పోయిన తర్వాత అటు కేసీఆర్ ఇటు కేటీఆర్. హరీష్ రావులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. కేటీఆర్ వెంటనే రాష్ట్రంలోని మహిళలకు భేషరతుగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గడ్డం శేఖర్ యాదవ్ తో పాటు బండి శ్రీకాంత్ యాదవ్. మక్కురి శ్రీకాంత్ యాదవ్. యాటకారి సిద్దేశ్వర్ . పిల్లన గోయిల శ్రీధర్ యాదవ్. తాజ్ బాబా. బొబ్బిలి శేఖర్ ముదిరాజ్. తీగల శివ ముదిరాజ్. గుంటి ప్రవీణ్. నసీరుద్దీన్.

తెలంగాణ మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసిన

కేటీఆర్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి...

మీ తండ్రి మీకు నేర్పిన గౌరవం సంస్కారం ఇదే నా కేటీఆర్....?

తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్...

కూకట్‌పల్లి, ఆగస్టు 16 (నమస్తే ఉదయం): తెలంగాణ మహిళల పట్ల చేసిన అవమానకర వ్యాఖ్యలకు కేటీఆర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ డిమాండ్ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిసి బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్‌లు, రికార్డింగ్ డాన్స్‌లు చేసుకోవచ్చు అని కేటీఆర్ అత్యంత జుగుప్సకరంగా మాట్లాడని, మీ తండ్రి మీకు నేర్పిన గౌరవం, సంస్కారం ఇదేనా కేటీఆర్?అని అన్నారు. మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డాన్స్‌లు చేస్తున్నారా? ఆడవాళ్ళంటే మీకు గౌరవం లేదా అని విమర్శించారు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం తెలుపుతూ భేషరతుగా

కేటీఆర్ తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి అని అన్నారు. ఆడవాళ్ళను కించపరిచే విధంగా బ్రేక్ డాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో వున్న బురదకు నిదర్శనమని, గత పది సంవత్సరాలు హైదరాబాద్లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీది కాదా అని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నామని,

అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసామని అన్నారు. శ్రమజీవులు, శ్రామిక మహిళలు ప్రయాణ సమయంలో సమయం వృధా చేయకుండా ఏదో పని చేసుకుంటే తప్పేంటి? అని ప్రశ్నించారు.

ఇంటి వద్ద చేసుకునే చిన్నా చితక పనులు బస్సుల్లో చేసుకుంటే... వారిని బ్రేక్ డాన్స్‌లు వేసుకోమనడం దుర్మార్గంఅని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు మీకు నచ్చవు, ఉచిత బస్సు ప్రయాణ ఆలోచన మీకు రాలేదు, పదేండ్లు మీరు చేయలేదు, మేము చేస్తే దాని మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీలో ప్రయాణాలు చేసేవాళ్లు తప్పుడు పనులు చేస్తున్నారన్నట్టుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, గుమ్మడికాయ దొంగలు ఎవరు అంటే కేటీఆర్ భుజాలు తడుముకోవడం ఎందుకు, కేటీఆర్ తక్షణమే మహిళలకు బహిరంగక్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ మహిళల పట్ల అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన

కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలి...

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, ఆగస్టు 16 (నమస్తే ఉదయం): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పట్ల అనుచితంగా మాట్లాడి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళల పట్ల ఇంత అవమానకరంగా మాట్లాడి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన కేటీఆర్ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మియాపూర్ మైత్రి నగర్ కమాన్ వద్ద నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళలతో కలిసి నిరసన తెలిపారు.

ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్ ప్రయానంతో ప్రజలలో వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేక తెలంగాణ మహిళా సమాజ

ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని, కేటీఆర్ ఒక ప్రధానమైన ప్రతిపక్ష పార్టీలో ఉండి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలు, కార్యక్రమాలకు తనవంతుగా సలహాలు, సూచనలు చేస్తూ, తెలంగాణ ప్రాంత ప్రజలకు లాభం చేకూర్చే విధంగా ఉండాలని కానీ తెలంగాణ సమాజం సిగ్గుపడేలా మాట్లాడం కేటీఆర్ అనాలోచిత విధానానికి, అహంకారానికి నిదర్శనన్నారు. ఇక ముందు ఇలాంటి ధోరణిలో మాట్లాడకుండా ఉండాలని,కేటీఆర్ తెలంగాణ ప్రాంత మొత్తం ఆడపడుచులతో పాటు తన ఇంటి ఆడపడుచులను కూడా అవమానపరిచే విధంగా మాట్లడడం చాలా బాధకరమని పోర్కొన్నరు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కేటీఆరపై చర్యలు తీసుకోవాలని ఆయన మహిళా లోకానికి క్షమాపణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళలు, యువకులు, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబని దర్శించుకున్న సీఎం సోదరుడు జగదీశ్వర్ రెడ్డి

అలంపూర్, ఆగస్టు16(నమస్తే ఉదయం): అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవది తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం అలంపురం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహోదరుడు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో పురంధర్ కుమార్ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు చేయించారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రాలు జ్ఞాపికను బహుకరించారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 6వ వర్ధంతి

రాజేంద్రనగర్, ఆగస్టు16(నమస్తే ఉదయం): భారత దేశ మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి 6వ వర్ధంతి కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ బీ. జే. పి. అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్ అధ్యక్షతన హైదర్

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గూడ చౌరస్తాలో శుక్రవారం జరిగింది. బీజేపీ నాయకులు వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి ఒక గొప్ప భారతీయ రాజకీయ నాయకుడని గుర్తు చేశారు. భారతదేశానికి మూడు పర్యాయాలు ప్రధాన మంత్రిగా పనిచేశారన్నారు. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులలో ఒకరన్నారు. హిందూ జాతీయవాద స్వచ్ఛంద సంస్థ అయిన ఆర్ ఎస్ ఎస్ సభ్యుడు కూడ అన్నారు. అతను హిందీ కవి, రచయిత కూడా అని తెలిపారు. అతను పెళ్లి కూడా చేసుకోకుండా భారత మాత సేవ కోసం చివర వరకు తన కుటుంబాన్ని సైతం త్యాగం చేసిన మహానుభావులు అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మోంద్ర కొమురయ్య, కాడెం సుధాకర్, రాచూరి రాజశేఖర్, కుక్కునూరి కిరణ్ చారి, సులిగే వెంకటేష్, కాకులారం కృష్ణ, నల్లింగ్ రమేష్, బీట్కూరి సిద్ధేశ్వర్, మోంద్ర నర్సింహా, పుస్తకాల అశోక్, ఎల్. వెంకటేష్, కొండమీది లింగం, బీజేవైఎం సందీప్, శెట్టిగారి శేఖర్, పొట్ట అనిల్ ముత్యం రెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పెద్దమనసు...

పస్మారక స్థితిలో ఉన్న ఓ వృద్ధున్ని వృద్ధాశ్రమంలో చేర్పించిన జగద్గిరిగుట్ట పోలీస్ సిబ్బంది....

కానిస్టేబుల్ రవి గౌడ్, వినోద్‌లను అభినందించిన స్థానిక ప్రజలు....

కూకట్‌పల్లి, ఆగస్టు 16 (నమస్తే ఉదయం): వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి ఉన్నాడని 100 కి సమాచారం ఇవ్వగా జగద్గిరిగుట్టకు సంబంధించిన పెట్రోలింగ్ పోలీసులు రవి గౌడ్, వినోద్ అక్కడికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న ఆ గుర్తు తెలియని వృద్ధునికి ఆహారం తినిపించిన అనంతరం ఆ వృద్ధున్ని వివరాలు అడగగా ఏమాత్రం స్పందించలేని స్థితిలో ఉన్నాడని గుర్తిం చిన పెట్రోలింగ్ సిబ్బంది అతనిని ఆల్విన్ కాలనీలో ఉన్న రాజేశ్వరి వృద్ధా శ్రమంలో చేర్పించారు. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో పోలీస్ సిబ్బంది చేసిన ఈ పనిని పలు వురు స్థానిక ప్రజలు అభినందించారు.

నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, ఆగస్టు 16(నమస్తే ఉదయం): గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం మీనాక్షి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శాతంరాయి గ్రామం, మీనాక్షి పేపర్ మిల్, ధర్మ కాంట, శాతం రాయి పారిశ్రామికవాడ ప్రాంతాలలో శనివారం ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు, శాతం రాయి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన బి ఈ లిమిటెడ్, పాశం బండ, సుచిర్ ఇండియా, ఆర్ జి కె, మంజీరా కండక్టర్, విఎన్ఆర్ వెంచర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు గగన్ పహాడ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో ప్రాంతాలైన గగన్ పహాడ్, గాగన్పహాడ్ పారిశ్రామిక వాడ, మెట్రో మాల్ గోశాల ఆంధ్ర లిక్కర్ ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు.

మైలర్ దేవ్పల్లి సెక్షన్లో... మైలార్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల ప్రాంతాలైన అబ్దుల్లా కాలనీ రాజీవ్ గాంధీ నగర్ ఢిల్లీ హోటల్ మిలాన్ కాలనీ, మైలార్దేవ్పల్లి గ్రామం ప్రాంతాలలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మైలార్దేవ్పల్లి విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో పారిశ్రామిక వాడ, గ్రీన్ విచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో పరిధిలో గల ప్రాంతాలైన క్రిస్టల్ టౌన్ రెహమ్మద్ కాలనీ హాశమాబాద్ దస్తగిరి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ ఇన్చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.

శివరాంపల్లి సెక్షన్‌లో...
శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు గోల్డెన్ సిటీ డైమండ్ సిటీ బెస్ట్ ప్రైస్ కాన్దారి హిల్స్ శ్రీదేవి కాలనీ భవానీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు భవాని కాలనీ ప్రేమావతి పేట పిల్లర్ నెంబర్ 285 వరకు, పహాడి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సులేమాన్ నగర్ చింతల్ మెట్ ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు సులేమాన్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన సులేమాన్ నగర్ కాజా హోటల్ డైమండ్ సిటీ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు భాషా నగర్ అక్బర్ హిల్స్ చింతల్ మెట్ ఇగ్బాల్ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు ఎన్ పి ఏ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, ప్రభుత్వ పాఠశాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ్ చారి తెలిపారు.

హిమాయత్ సాగర్‌లో... సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి ఒంటిగంట వరకు మ్యాప్ ప్లే టౌన్, విశ్వాస నగర్, స్పెషల్ బ్లాక్, బి బ్లాక్, సన్ సిటీ ప్రధాన గెట్ ప్రాంతాలలో, మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు స్నేహిత విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన బి అండ్ టీ కాలనీ ఏ బి సి డి, స్పెషల్ బ్లాక్, సన్ సిటీ ప్రాంతాలలో, మధ్యాహ్నం ఒంటి గంటల నుండి రెండు గంటల వరకు ఖాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదర్శనగర్ బైరాగిగూడ భవాని కాలనీ గంధం గూడ హిమగిరి కాలనీ హైదర్ షాకోట్ జె.ఎల్.ఎన్.ఎస్ కాలనీ కపిల్ నగర్ , శ్రీనివాస నగర్ సన్ సిటీ మెయిన్ గేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

న్యాయం కోసం ఆరు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న భార్య

ఎంతకీ న్యాయం జరగకపోవడంతో భర్త ఇంటి ముందు ఆందోళన దిగిన భార్య

రాజేంద్రనగర్, ఆగస్టు 16 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడలో భార్య భర్త పై న్యాయపోరాటనికి దిగింది. శుక్రవారం హైదర్‌గూడలోని భర్త ఇంటి ముందు బైటాయించింది. దివ్యాంగుడైన కుమారుడు కౌశిక్ తో కలిసి ఆందోళన చేపట్టింది. పూర్తి వివరాలలోకి వెలితే... సనత్ నగర్ ఫతేనగర్‌కు చెందిన అలేఖ్యకు హైదర్‌గూడకు చెందిన ఉదయ్ భాస్కర్‌కు 2014లో వివాహం జరిగింది.

2016లో బాబు పుట్టాడు. బాబు పుట్టుకతోనే బుద్ధి మాంద్యంతో పుట్టాడు. అప్పటినుంచి భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. 2018వ సంవత్సరంలో దివ్యాంగుడైన కుమారుడిని కన్నావంటూ భర్త బిట్కూరి ఉదయ్ భాస్కర్ ఆమెను వదిలేశాడు. కుమారుడిని వదిలేసి ఇంటికి రావాలని పట్టుబట్టాడు. బాబును వదిలేసేందుకు అలేఖ్య ఒప్పుకోలేదు. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులకు, భర్త కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అలేఖ్య ఫిర్యాదు మేరకు సనత్ నగర్ పోలీస్ స్టేషన్లో ఉదయ్ భాస్కర్ పై కేసు నమోదయింది.

అప్పటినుంచి భార్యాభర్తల మధ్య కోర్టులో కేసు నడుస్తోంది.

భర్త ఉదయ భాస్కర్ ఇంటి ముందు కుటుంబ సభ్యులతో అలైఖ్య



భర్త ఉదయ భాస్కర్, కుమారుడు కౌశిక్‌తో అలైఖ్య

ఉదయ భాస్కర్ - అలైఖ్య పెళ్లి నాటి ఫోటో

సంవత్సరాలు గడిచినా కోర్టులో న్యాయం జరగకపోవడంతో అలేఖ్య భర్త ఇంటిముందు కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించి న్యాయం చేయాలని కోరింది.

దీంతో ఉదయ భాస్కర్ కుటుంబ సభ్యులు 15 రోజుల వ్యవధిలో తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అలేఖ్య తన నిరసనను విరమించుకుంది.

డాక్టర్‌లపై దాడులు అరికట్టాలి

కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన నిర్వహించిన వైద్యులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు16(నమస్తే ఉదయం): ప్రజలకు వైద్యం ద్వారా సేవలు అందిస్తూ అనేక మంది ప్రాణాలను కాపాడుతున్న వైద్యులపై దాడులు చేసి చంపడంపై ప్రభుత్వాలు స్పందించాలని గద్వాల జిల్లా మెడికల్ అసోసియెషన్ సభ్యులు డాక్టర్ మోహన్ రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలకత్తాలోని డ్యూటీలో వున్నా మెడికల్ డాక్టర్‌పై కొంత మంది మూకారులు దాడి చేసి చంపడంపై ఇండియన్ మెడికల్ అస్సోసియేషన్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ నుండి కృష్ణ వేణి చౌరస్తా వరకు క్వోత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ రాత్రి, పగలు అని తేడా లేకుండా నిరంతరంగా శ్రమిస్తున్న డాక్టర్ లపై దాడులు చేస్తూ భౌతికంగా హింసిస్తున్నా ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కలకత్తాలొ జరిగిన సంఘటన పై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా భేనర్జీ, దేశ ప్రధాని మోడీ స్పందించాలని డాక్టర్‌లు డిమాండ్ చేశారు. కలకత్తా లో జరిగిన సంఘటనకు భాద్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ప్రభుత్వాలను కోరారు. ఇండియన్ మెడికల్ అస్సోసియేషన్ దేశ వ్యాప్త పిలుపు మేరకు నేటి నుండి 24 గంటల వరకు వైద్య సేవలు నిలిపివేస్తున్నామని, అత్యవసర సేవలు తప్ప అన్నిరకాల వైద్య సేవలు నిలిపివేసి నిరసన చేపట్టడం జరుగుతుందని డాక్టర్స్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ లు గోవర్ధన్, నళిని, కిషోర్, అశోక్, శ్యామ్, శ్రీధర్ గౌడ్, వృషాలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

మ్రొక్కు తీర్చుకున్న వనపర్తి కాంగ్రెస్ సీనియర్ నేత సతీష్

కొత్తకోట, ఆగస్టు16 (నమస్తే ఉదయం): వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పోటి చేసిన ప్రస్తుత గౌరవంమ శాసనసభ్యులు తూడిమేఘరెడ్డి గెలవాలని గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత సమన్వయ కర్త శ్రీలక్కాకులసతీష్ గారు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో శ్రీకోటిలింగేశ్వరస్వామివారిని మ్రొక్కుకొని

ఆలయ కమిటీకి చెక్కు అందజేస్తున్న సతీష్

శాసనసభ్యుడిగా గెలిచిన వెంటనే ఐదు లక్షల రూపాయలు విరాళం ప్రకటించి ఇప్పుడు ఐదు లక్షల రూపాయలను ఈరోజు శ్రీకోటిలింగేశ్వరస్వామివారి సమక్షంలో అందచేశారు.

కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రుమాళ్ళమహేశ్వర్ ఆలయప్రధానకార్యదర్శి రుమాళ్ళశేఖర్ ఆలయ నిర్వాహకులు రుమాళ్ళజగధీశ్వర్ , ఆలయ అర్చకులు జగదీష్ స్వామి ,అనిల్ స్వామి, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకులసతీష్, టౌన్ అధ్యక్షుడు చీర్ల చందర్ కౌన్సిలర్ లు వెంకటేష్ , మధుగౌడ్ , ఎస్ ఎల్ ఎన్ అధినేత రమేష్, మన్యంకొడ , రామకృష్ణ లు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ టిపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు...

కూకట్‌పల్లి, ఆగస్టు 16 (నమస్తే ఉదయం): టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం, ఇందుమతి శ్రీరంగం 26 వివాహ వార్షికోత్సవం వారి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, గోవింద్ గౌడ్, నజీర్ భాయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు హరీష్, కలికోట శంకర్, విశాల్, అరుణ్ గౌడ్, బాల, మహేష్ గౌడ్, నరసింహ యాదవ్, శ్రావణ్, మస్తాన్ రెడ్డి, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమా దేవి, మహిళా డివిజన్ అధ్యక్షురాలు మారుతీ, జోజోమ్మ, భారతమ్మ, రాధ, విజయ లక్ష్మి, జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం సాగునీటి ఇబ్బందులు రానివ్వదు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కాలువలో జమ్మూ వండుమట్టిని తొలగించాలి

వీపనగండ్ల,ఆగస్టు16(నమస్తే ఉదయం): సాగునీటి కాలువలలో అడ్డుగా ఉన్న జమ్మును పేరుకుపోయిన ఒండ్రు మట్టిని తొలగించేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పానుగల్ మండల పరిధిలోని రేమొద్దుల, కిష్టాపూర్,గోప్లాపూర్ గ్రామాల శివారులలో ఉన్న కేఎల్ఐ డి8 కాలువను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రైతులకు సాగునీటి కష్టాలను రానివ్వవద్దని, కాలువలలో పేరుకుపోయిన ఒండ్రు మట్టి, జమ్మును తొలగించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

కాలువలలో సాగునీరు ముందుకు పారేలా రైతులు సహకరించాలని ఆయన కోరారు.రైతులకు సాగునీరు అందించే విషయంలో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలను సిద్ధంచెయ్యాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు,మాజీ జడ్పీటీసీ రవి కుమార్,,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్ సాగర్,రాము యాదవ్,పుల్లా రావు,బ్రహ్మం, ఇరిగేషన్ అధికారులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఐ కాలువను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రైతులతో మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733